# నమస్తే తెలంగాణ
# ఖమ్మం
5 | ఖమ్మం, శుక్రవారం 27 డిసెంబర్ 2024 | KHAMMAM


## 'ఎర్రోళ్ల' అరెస్టు అప్రజాస్వామికం

### ఇది ఇందిరమ్మ రాజ్యమా? పోలీసు రాజ్యమా?: నామా, రేగా, సండ్ర



నామా నాగేశ్వరరావు | రేగా కాంతారావు | సండ్ర వెంకటవీరయ్య | బానోతు చంద్రావతి

ఖమ్మం/ బూర్గంపహాడ్, డిసెంబర్ 26: బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు; ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ అరెస్టు అప్రజాస్వామికమని ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, సత్తుపల్లి, వైరా మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, బానోత్ చంద్రావతి అన్నారు. అతడి కుటుంబ సభ్యులకు కనీస సమాచారం ఇవ్వకుండా, ఎలాంటి నోటీసూ అందజేయకుండా ఆయనను అరెస్టు చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు గురువారం వారు వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు. గురువారం ఉదయమే పోలీసులు అతడి ఇంటి వద్దకు వెళ్లి అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గమైన చర్య అని అభివర్ణించారు. ఉద్దేశపూర్వకంగానే సెలవు రోజుల్లో తమ పార్టీ నేతలను అరెస్టు చేయిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి.. నియంతలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఆయనకు ఈ పైశాచిక ఆనందం ఎక్కువకాలం నిలవదని స్పష్టం చేశారు. అక్రమ కేసులు, అరెస్టులకు బీఆర్ఎస్ శ్రేణులు భయపడరనే విషయాన్ని గుర్తుంచుకోవాలని హితవుచెప్పారు. ఇందిరమ్మ రాజ్యమని చెప్పుకుంటూ పోలీసు రాజ్యంలా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ పాలకులకు తెలంగాణ సమాజమే తగిన బుద్ధిచెబుతుందని స్పష్టం చేశారు. ఎర్రోళ్ల శ్రీనివాస్‌పై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేసి ఆయనను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## పారిశ్రామిక వేత్తల కోసమే కాంగ్రెస్ పనిచేసింది

- రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ దేశ విచ్ఛిన్నాన్ని కోరుకుంది
- ఖమ్మంలో సీపీఐ శతజయంతి వేడుకల్లో పార్టీ నేతలు



శతజయంతి ఉత్సవాల్లో అభివాదం చేస్తున్న సీపీఐ నాయకులు

ఖమ్మం కమాన్‌బజార్, డిసెంబర్ 26 : కమ్యూనిస్టుల పురోగమనమే దేశానికి రక్ష అని, యావత్ దేశంలో కమ్యూనిస్టుల అవసరం పెరుగుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. ఖమ్మంలో గురువారం నిర్వహించిన సీపీఐ శతజయంతి వేడుకల్లో ఆయన మాట్లాడారు. పుట్టుక నుంచే తమ పార్టీ అనేక నిర్బంధాలను ఎదుర్కొన్నదని గుర్తుచేశారు. దాదాపు ఒకే సమయంలో అవిర్భవించిన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) దేశ విచ్ఛిన్నాన్ని కోరుకుందని విమర్శించారు. కానీ.. తాము మాత్రం కార్మికులు, కర్షకులు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పనిచేశామని గుర్తు చేశారు. అదే సమయంలో కాంగ్రెస్ మాత్రం పారిశ్రామిక వేత్తల కోసం, సంపన్న వర్గాల కోసం పని చేసిందని విమర్శించారు. ఈ సందర్భంగా ఖమ్మంలో భారీ ఎర్ర కవాతును నిర్వహించారు. అనంతరం భక్తరామదాసు కళాక్షేత్రంలో జరిగిన మహాసభలో పార్టీ నేతలు ప్రసంగిస్తూ పార్టీ పోరాట చరిత్రను వివరించారు. నేతలు పువ్వాడ నాగేశ్వరరావు, బాగం హేమంతరావు, మహ్మద్ మౌలానా, జమ్ముల జితేందర్‌రెడ్డి, ఎర్రా బాబు, జానీమియా, లతాదేవి తదితరులు పాల్గొన్నారు.

- 'పెట్టుబడి'పై ప్రకటనలకే పరిమితమవుతున్న సర్కారు
- 'ఖమ్మం' అన్నదాతలపై సీజన్‌కు రూ.350 కోట్ల ఆర్థిక భారం
- పాత అప్పులు పూడక, కొత్త అప్పులు పుట్టక అవస్థలు
- రైతుభరోసా రాక వడ్డీ వ్యాపారుల తలుపు తడుతున్న రైతులు

# యాసంగికైనా భరోసా ఉందా?

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడాది దాటినా రైతుభరోసా సంగతి మాత్రం జాడలేకుండా పోతోంది. ఇప్పటికే గడిచిన వానకాలం సీజన్‌లోనూ రైతుభరోసా కింద అన్నదాతలకు పంటల పెట్టుబడి సాయాన్ని అందించని రేవంత్ సర్కారు.. ఇప్పుడు మొదలైన యాసంగికైనా ఇస్తుందో.. లేదోనన్న ఆందోళన అన్నదాతలను వెంటాడుతోంది. ఇప్పటికే గడిచిన వానకాలంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా ఇవ్వకపోవడంతో రైతులందరూ అప్పులు తెచ్చుకొని మరీ ఆ సీజన్‌ను గట్టెక్కించుకున్నారు. ఇక ఇప్పుడు యాసంగిపైనా స్పష్టత కన్పించడం లేదు. 'అదిగో.. ఇదిగో..' అంటూ ప్రకటనలకే పరిమితమవుతోంది తప్ప స్పష్టమైన నిర్దిష్ట సమయాన్ని మాత్రం చెప్పడం లేదు. దీంతో 'ప్రభుత్వం నుంచి సాయం అందుతుందా? లేక మళ్లీ వడ్డీ వ్యాపారుల తలుపు తట్టాలా?' అనే ఆవేదనను, ఆందోళనను అన్నదాతలు వ్యక్తం చేస్తున్నారు. కానీ.. చాలామంది రైతుల ఆర్థిక పరిస్థితి చాలా దయనీయంగా ఉంది. ఇప్పటికే గత వానకాలానికి తెచ్చిన అప్పులు పూడకపోవడంతో కొత్త అప్పులు కూడా పుట్టడం లేదు. దీంతో సీజన్ ముంగిటకొచ్చినా చేతిలో పెట్టుబడి సాయం లేక అన్నదాతలు అల్లాడుతున్నారు. ఖమ్మం జిల్లా రైతులపై ఒక్కో సీజన్‌కు రూ.350 కోట్ల భారం పడుతోంది. ఆ మొత్తాన్ని రైతుభరోసా కింద ప్రభుత్వం ఇవ్వకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో అధిక వడ్డీలకైనా తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

-ఖమ్మం, డిసెంబర్ 26 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)



కాంగ్రెస్ ప్రభుత్వం ఊరించడంతో గత వానకాలం సీజన్‌లో పంటల పెట్టుబడి సాయం అందుతుందనుకున్న అన్నదాతల ఆశలు ఉసూరుమన్నాయి. దీంతో 'ఈ యాసంగికైనా సాయం అందేనా?' అనుకుంటూ వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. ఏడాది క్రితం వరకూ అధికారంలో ఉన్న బీఆర్ఎస్ సర్కారు.. ఒక్కో సీజన్‌కు రూ.5 వేల చొప్పున రెండు సీజన్లకు కలిపి ఎకరానికి రూ.10 వేలను రైతుబంధు పథకం కింద అన్నదాతలకు పంటల పెట్టుబడి సాయంగా నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తూ వచ్చింది. సరిగ్గా గత యాసంగి సీజన్ పెట్టుబడి సాయం అందించే సమయానికి అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడం, రైతుబంధు కోసం గత కేసీఆర్ ప్రభుత్వం ఎన్నికల సంఘం నుంచి అనుమతి తెచ్చుకున్నా అప్పటి ప్రతిపక్షమైన కాంగ్రెస్ ఈసీకి ఫిర్యాదు చేసి దానిని అడ్డుకోవడం, దీంతో గత యాసంగి పంటల పెట్టుబడి రైతుల ఖాతాల్లో జమ కాకపోవడం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు.. తమ హామీ ప్రకారం తాను ఇస్తానన్న రూ.7,500 కాకుండా.. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చినట్లుగానే రూ.5 వేలు మాత్రమే ఇచ్చింది. అది కూడా అధికారం చేపట్టిన చాన్నాళ్లకు కాలయాపన చేసీ చేసీ అందించింది.

### నిత్యం దాటవేతలతో..

గడిచిన రెండు సీజన్లుగా రైతుభరోసా ఇవ్వకుండా కాలయాపన చేస్తున్న కాంగ్రెస్ సర్కారుపై రైతుల్లో తిరుగుబాటు వస్తోంది. ఇలా అన్నదాతల్లో అసంతృప్తి వ్యక్తమవుతున్న ప్రతిసారీ ఏదో ఒక కారణం చెబుతూ దాటవేస్తూ వస్తోంది కాంగ్రెస్ సర్కారు. అయినా ప్రభుత్వం రైతుభరోసా ఇవ్వకపోవడంతో చివరికి రైతులందరూ ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించి అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకొని మరీ తమ పంటలను సాగు చేసుకుంటున్నారు.

### రుణమాఫీ చేయకుండా..

ఇకపోతే కొత్త అప్పుల కోసం బ్యాంకుల వద్దకు వెళ్తున్న రైతులకు అక్కడ కూడా నిరాశే ఎదురవుతోంది. అనేక కొర్రీలు పెట్టి పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయకపోవడంతో చాలామంది రైతులు బ్యాంకులకు తమ పంట రుణాలను చెల్లించాల్సి ఉంది. అవి చెల్లించకుండా కొత్త రుణాలు ఇవ్వబోమంటూ బ్యాంకర్లు స్పష్టం చేస్తున్నారు. దీంతో అధికారుల వద్దకు పరుగులు పెట్టి తమ పంట రుణాలను మాఫీ చేయాలంటూ కోరుతున్నారు. ఇటీవల నిరసనలకు దిగిన సందర్భాలూ ఉన్నాయి.

### ఒక్కో సీజన్‌కు రూ.350 కోట్ల భారం

2023 వానకాలం సీజన్ గణాంకాల ప్రకారం జిల్లావ్యాప్తంగా 3.08 లక్షల మంది రైతులకు సుమారుగా రూ.360 కోట్లు పంటల పెట్టుబడి సాయంగా అందాయి. అయితే కాంగ్రెస్ ప్రభుత్వ హామీ ప్రకారం ఒక్కో సీజన్‌కు ఎకరానికి రూ.7,500 చొప్పున అందజేస్తే.. జిల్లావ్యాప్తంగా దాదాపుగా రూ.400 కోట్లు రైతుల అకౌంట్లలో జమ చేయాల్సి ఉంది. అయితే ఏటా జూన్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు వానకాలం సీజన్ ఉంటుంది. వ్యవసాయ శాఖ గణాంకాల ప్రకారం అక్టోబర్ 1 నుంచి యాసంగి మొదలవుతుంది. ఇక గత సీజన్‌లో రైతభరోసా ఇవ్వకపోవడంతో సుమారు రూ.350 కోట్లు రైతులపై భారం పడినట్లయింది. ఈ యాసంగికి కూడా మరో రూ.350 కోట్ల మేర ఆర్థిక భారం పడే అవకాశముంది. ఇక వానకాలం, యాసంగి కలిపి ఇవ్వాలంటే ఎకరానికి రూ.15 వేల చొప్పున ఈ భారం రెట్టింపవుతుంది. అయితే, తెలంగాణ ఆవిర్భావం తరువాత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతుబంధు మొదలైనప్పటి నుంచి నిరాటంకంగా అందిన రైతుబంధు వల్ల ఏటికేడు సాగు విస్తీర్ణం, దిగుబడి వంటివి పెరిగాయి. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసాను జాప్యం చేస్తున్న కారణంగా సాగు విస్తీర్ణం కూడా తగ్గిపోయే ప్రమాదం ఉంది.

### పాత అప్పులు మాఫీ కాక..

'మేం అధికారంలోకి రాగానే రూ.2 లక్షల రుణమాఫీ చేస్తాం. వెంటనే వెళ్లి బ్యాంకుల్లో పంట రుణాలు తెచ్చుకోండి' అంటూ ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టిన రేవంత్‌రెడ్డి.. అధికారంలోకి వచ్చాక అనేక కొర్రీలు పెట్టారు. రూ.2 లక్షల్లోపు పంట రుణాలను మూడు విడతల్లో మాఫీ చేస్తామని చెప్పి 'మమ' అనిపించారు. తీరా చూస్తే చాలామంది రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ కానే లేదు. దీంతో పాత అప్పులు మాఫీ కాని రైతులెవరికీ బ్యాంకులు కొత్తగా రుణాలు ఇవ్వలేదు. డీసీసీబీలోని పంట రుణాలను విశ్లేషించినా ఈ విషయం అర్థమవుతుంది. ఖమ్మం డీసీసీబీలో రూ.2 లక్షల్లోపు రుణాలున్న రైతులు 1.69 లక్షల మంది ఉన్నారు. వారిలో కేవలం 65 లక్షల మందికి మాత్రమే రుణమాఫీ కావడం గమనార్హం.

## మంత్రుల మాస్కలతో నిరసన

### 16వ రోజుకు చేరిన ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె



ఖమ్మం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

ఖమ్మం ఎడ్యుకేషన్, డిసెంబర్ 26 : ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని, తమ అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు(ఎస్ఎస్ఏ) చేపట్టిన సమ్మె గురువారం నాటికి 16వ రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా రాష్ట్ర మంత్రుల మాస్కలు ధరించి ఈ నెల 30వ తేదీన జరిగే క్యాబినెట్‌లో తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఖమ్మం కలెక్టరేట్ ఎదుట వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ తాము చేస్తున్న ఉద్యమం వెనుక ఏ సంఘం, ఏ శక్తి లేదన్నారు. తమ సమ్మెపై తీన్మార్ మల్లన్న చేస్తున్న అభియోగాలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు పాషా, వీరస్వామి, ఉద్యోగులు పాల్గొన్నారు.

## 'సీఆర్టీల' మౌన ప్రదర్శన

### భద్రాచలంలో ఏడో రోజుకు చేరిన సమ్మె



భద్రాచలంలో మూతికి నల్లబ్యాడ్జీలు ధరించి మౌన ప్రదర్శన చేస్తున్న సీఆర్టీలు

భద్రాచలం, డిసెంబర్ 26 : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్లు(సీఆర్టీలు) చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం నాటికి ఏడో రోజుకు చేరింది. ఈ సందర్భంగా సీఆర్టీలు మూతికి నల్లబ్యాడ్జీలు ధరించి భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయం నుంచి పాత మార్కెట్, అంబేద్కర్ సెంటర్, ఆర్టీసీ బస్టాండ్ వరకు మౌన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం బీఆర్ అంబేద్కర్, కుమ్రం భీం విగ్రహాలకు సమస్యలతో కూడిన వినతిపత్రాలు సమర్పించారు. ఏళ్లతరబడి పనిచేస్తున్నా తమ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం తాత్సారం చేస్తున్నదని, సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మెను ఆపేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంట్రాక్టు ఉపాధ్యాయులు, గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

## ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి: తమ్మినేని



సభలో పాల్గొన్న ఆశా కార్యకర్తలు

ఖమ్మం కమాన్‌బజార్, డిసెంబర్ 26: ఆశా వర్కర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ఆశ వర్కర్ల సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా బస్సుయాత్ర నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా యాత్ర గురువారం ఖమ్మానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఖమ్మంలోని మంచికంటి భవన్‌లో జరిగిన ఆశా కార్యకర్తల సభలో తమ్మినేని మాట్లాడారు. అధికారంలోకి వస్తే ఆశా కార్యకర్తలకు కనీస వేతనం నిర్ణయిస్తామని, సమస్యలు పరిష్కరిస్తామని హామీలు ఇచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక ఆ హామీలను విస్మరించిందని విమర్శించారు. ఆ హామీలకు కట్టుబడి ఆశా కార్యకర్తల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు పాలడుగు భాస్కర్, వై.విక్రమ్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## పూబెల్లి అభివృద్ధికి ప్రణాళికలు : ఏపీఎం

ఇల్లెందు రూరల్, డిసెంబర్ 26: పూబెల్లి ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఏపీఎం దుర్గారావు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పూబెల్లి గ్రామంతోపాటు ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం పస్రా సమీపంలోని బ్లాక్ బెర్రీ దీవులను తన బృందంతో కలిసి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యాటక ప్రాంతంగా పూబెల్లిని తీర్చిదిద్దేందుకు అన్ని వనరులు పుష్కలంగా ఉన్నాయని, అభివృద్ధి కోసం ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్నామని తెలిపారు. నివాస టెంట్లు, బోటింగ్, కొండలపై ట్రెక్కింగ్, సైక్లింగ్, దండ గుండాలకు ఆనుకొని ఉన్న చలిగుండాలు, సెలయేర్లు, క్యాటిల్ అండ్ షిప్, గోట్స్ షెడ్, గిరిజనుల రుచికరమైన వంటకాలు, ఆదివాసీ హస్త కళానైపుణ్యంతోపాటు సంస్కృతీ సంప్రదాయాల పరిచయం తదితర సౌకర్యాలను పర్యాటకులకు అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ, సంఘం అధ్యక్షురాలు తోలెం కృష్ణవేణి, మూతి బాయమ్మ, ముత్యాలు, జోగ శ్రీకాంత్, ఎట్టి కిరణ్, మచ్చ నవీన్, కల్తి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.






# 'ఇందిరమ్మ' సర్వేకు సాంకేతిక సమస్య

- యాప్‌తో ఇబ్బంది పడుతున్న సిబ్బంది
- గడువులోగా సర్వే పూర్తి సాధ్యమేనా?
- సొంతింటి కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులు



ఇందిరమ్మ ఇంటి సర్వే చేస్తున్న సిబ్బంది



దరఖాస్తుదారుల ఫొటో తీస్తున్న సర్వే సిబ్బంది

అశ్వారావుపేట, డిసెంబర్ 26: పేదల సొంతింటి కల సాకారం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ పథకం ఇంటింటి సర్వేను సాంకేతిక సమస్య వెంటాడుతోంది. యాప్ సక్రమంగా పని చేయకపోవడంతో సర్వే సిబ్బంది నానా ఇబ్బంది పడుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే సర్వే గడువులోగా ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తికాదనే చర్చ జరుగుతోంది. డిసెంబర్ 31వ తేదీలోగా సర్వే పూర్తిచేయాల్సి ఉన్నప్పటికీ మరో నెల అంటే వచ్చే ఏడాది జనవరి చివరి వరకు కూడా సర్వే పూర్తి అవుతుందా.. లేదా అనే అనుమానం సిబ్బందిని కలవరపెడుతోంది. ఇందిరమ్మ పథకం అర్హుల గుర్తింపులో సిబ్బంది ఆపసోపాలు పడుతున్నారు. సాంకేతిక సమస్యలు ఇంటింటి సర్వేకు ఆటంకాలు కలిగిస్తున్నాయి. ఏజెన్సీ ప్రాంతాల్లో నెట్ సిగ్నల్ సమస్యతో సర్వే ముందుకు సాగడంలేదు. పట్టణాల్లో సైతం సర్వర్ మొరాయిస్తున్నది. వివరాలు అన్ని నమోదు చేశాక ఇక్కసారిగా మళ్ళీ సర్వే మొదటికి వచ్చేస్తున్నది. అన్ని సక్రమంగా జరిగితే ఒక్కొక్క సిబ్బంది రోజుకు కనీసం 40 నుంచి 50 కుటుంబాల వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. కానీ సాంకేతిక సమస్యతో కనీసం 10 నుంచి 15 కుటుంబాల వివరాల నమోదు గగనమవుతోంది. రెవెన్యూ ఉద్యోగులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది సర్వేలో పాల్గొంటున్నారు.

### సర్వే ఇలా..?

ప్రభుత్వానికి అందిన దరఖాస్తులను పరిశీలించి పేదల వివరాలను ఇందిరమ్మ యాప్‌లో సర్వే సిబ్బంది నమోదు చేయాల్సి ఉంటుంది. మొత్తం 13 కాలమ్స్‌ను పూర్తిచేయాలి. మొదటి కొన్ని ప్రశ్నలకు సమాధానాలు నమోదు చేయాలి. సొంతింట్లో ఉంటున్నారా.. లేదా అద్దె ఇంట్లో ఉంటున్నారా అనే వివరాలను యాప్‌లో పొందపరచాలి. ప్రస్తుతం నివాసం ఉంటున్న ఫొటో, ఇంటి స్థలం ఉంటే దానికి సంబంధించిన పత్రాలనూ యాప్‌లో నమోదు చేయాల్సిందే. ఖాళీ స్థలం ఉంటే దాని వివరాలు నమోదు చేశాక, సంబంధిత వ్యక్తికి ఆ స్థలం ఉందా.. లేక వ్యక్తి కుటుంబసభ్యుల పేరిట ఉందా అన్న వివరాలను నమోదు చేసుకోవాలి. సర్వే ప్రక్రియ ఇలా ఉంటే వివరాలు నమోదు సమయంలో యాప్ సర్వర్లు మొరాయించడంతో సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు. ఒక్కో ఇంటివద్దనే గంటల కొద్దీ యాప్‌తో యుద్ధం చేయాల్సి వస్తున్నది. అధికారులు బృందాలుగా ఏర్పడి కేటాయించిన ప్రాంతాల్లో యాప్ ద్వారా సర్వే నిర్వహిస్తున్నారు. పరిశీలించిన దరఖాస్తుల్లో సగంమంది అనర్హులుగానే సిబ్బంది అనుమానిస్తున్నారు. గత ఏడాది ప్రజాపాలన గ్రామసభల్లో స్వీకరించిన దరఖాస్తుల ఆధారంగా లబ్ధిదారుల ఎంపిక కోసం అధికారులు సర్వే నిర్వహిస్తున్నారు.

### ముందుకు సాగని సర్వే..

సాంకేతిక సమస్యతోపాటు దరఖాస్తుదారులు అందుబాటులో లేకపోవడంతో సర్వే ముందుకు సాగడం లేదు. ప్రధానంగా సర్వర్ సమస్యే సిబ్బందిని ఇబ్బందికి గురిచేస్తున్నది. నియోజకవర్గవ్యాప్తంగా మొత్తం 69,422 దరఖాస్తులు ప్రజాపాలన గ్రామసభల్లో అధికారులు స్వీకరించగా వీటిలో 52,283 మంది ఇళ్ళ కోసం ఎదురుచూస్తున్నారు. అశ్వారావుపేట మండలం నుంచి 16,184, దమ్మపేట నుంచి 15,653, ములకలపల్లి నుంచి 10,838, అన్నపురెడ్డిపల్లి నుంచి 5,560, చంద్రుగొండ మండలం నుంచి 9,048 మంది దరఖాస్తుదారులు ఇందిరమ్మ ఇంటికోసం పడిగాపులు పడుతున్నారు. వీరిలో రేవంత్ రెడ్డి సర్కార్ ఎంతమందిని అర్హులుగా గుర్తిస్తారోననే ఆందోళన అర్జీదారులకు నిద్రపట్టనీయడం లేదు. మొదటి విడతగా నియోజకవర్గానికి 3,500 ఇళ్ళు మంజూరు చేస్తామని చెబుతున్న ప్రభుత్వం అర్హుల ఎంపికను పారదర్శకంగా ఎలా చేపడుతుందన్న ప్రశ్న వ్యక్తమవుతోంది. ఇప్పటివరకు కనీసం 35శాతం సర్వే కూడా పూర్తికానట్లు స్పష్టమవుతోంది.

### ఆఫ్‌లైన్‌లో వివరాలు నమోదు

ఇందిరమ్మ ఇంటి సర్వేలో సాంకేతిక సమస్యను గుర్తించాం. సర్వర్ పనిచేయని ప్రాంతాల్లో ఆఫ్‌లైన్‌లోనే వివరాలు నమోదు చేయాలని సర్వే సిబ్బందికి స్పష్టంచేశాం. ఎట్టి పరిస్థితుల్లోనూ గడువులోగా సర్వే పూర్తి చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించాం.

– పి.కృష్ణప్రసాద్, తహసీల్దార్, అశ్వారావుపేట





